సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం ౹ 29 ౹ మే ౹ 2023



టిప్పర్ ఢీ: ఇద్దరి దుర్మరణం

కడపలోని రిమ్స్ సమీపంలో స్నేహితుడి కోసం ఎదురు చూస్తున్న ఇద్దరిని మట్టి తీసుకెళుతున్న టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. - 8లో



16 మంది ఎర్రస్మగ్లర్ల అరెస్టు

వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు, అన్నమయ్య జిల్లా తుమ్మలబైలు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 16 మంది స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.160
రెండోరకం	రూ.70	రూ.116



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 967 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	345	453
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 2061.28 కిలోలు

న్యూస్‌రీల్

స్పందన కార్యక్రమం

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌ల ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తామన్నారు.

నేడు 2015లో బదిలీ అయిన ఉపాధ్యాయుల సమావేశం

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో 2015లో బదిలీ అయి తాజా బదిలీల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్న ఉపాధ్యాయుల సమావేశాన్ని 29వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు కడప ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బాధిత ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, మహేశ్వర రెడ్డి, దేవదాస్, గౌస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో తమకు జరిగిన నష్టాన్ని చర్చించి న్యాయపరంగా, ప్రత్యక్షంగా పోరాటం చేయడంపై కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. బాధిత ఉపాధ్యాయులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

గ్రంథాలయ సంస్థలో బదిలీలు



ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులను అందజేస్తున్న చైర్‌పర్సన్ ఉషారాణి

కడప కల్చరల్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న గ్రంథాలయ అధికారులు సిబ్బందికి ఆదివారం బదిలీలు నిర్వహించారు. సంస్థ చైరపర్సన్ ఎల్. ఉషారాణి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఒకే చోట 5 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన వారికి వారి అభ్యర్థన, పరిపాలన సౌలభ్యాలను దృష్టిలో ఉంచుకొని బదిలీలు చేపట్టామని ఈ సందర్భంగా చైర్‌పర్సన్ తెలిపారు. విధుల్లో చేరిన ఉద్యోగులు సమయపాలన, క్రమశిక్షణ పాటించి ప్రజల్లో గౌరవం పొందడంతో పాటు సంస్థ గౌరవం పెంచాలని సూచించారు. అనంతరం ఉద్యోగులకు బదిలీల ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసాచారి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న అతిథులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జేఎన్‌టీయూఏ వైస్‌చాన్సలర్ జింకా రంగజనార్దన్ మాట్లాడుతూ చదువుతోనే ఏదైనా సాధించగలమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏది ఇష్టమో తెలుసుకుని వాటిలో విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉన్నత స్థానాల్లో నిలుస్తారన్నారు. తెలంగాణ ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ ప్రస్తుతమున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు నిరంతరం శ్రమించి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బంగారు భవితకు కానుక

- జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధం
- బడితెరిచిన తొలిరోజే పంపిణీకి కసరత్తు
- గతానికి భిన్నంగా మండల స్థాయిలో స్టోరేజీ పాయింట్లు
- కిట్ల నిల్వ, రవాణాకు జిల్లా, మండల స్థాయి కమిటీలు



మండల కేంద్రానికి అందజేస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లు

మదనపల్లె సిటీ: జిల్లాలో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది కిట్ల పంపిణీలో మరింత పారదర్శకతతో పాటు వేగంగా విద్యాకానుక అందించేందుకు కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఈ ఏడాది విద్యాకానుక సామగ్రిని ఆయా మండల హెడ్‌క్వార్టర్స్‌కు నేరుగా వచ్చేలా చూశారు. రాష్ట్ర స్థాయి నుంచి మండల స్టాక్ పాయింట్లకు మే 1 నుంచి 31వతేదీలోపు.. అక్కడి నుంచి జూన్ 1 నుంచి 12వతేదీలోపు అన్ని స్కూల్స్‌కు అందేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అంటే వేసవి సెలవుల తర్వాత విద్యార్థులు బడికి వచ్చిన మొదటి రోజే జేవీకే కిట్లు అందించనున్నారు. గతంలో విద్యార్థి తల్లి మాత్రమే వచ్చి కిట్టును తీసుకువెళ్లాలనే నిబంధన ఉండేది. ఇప్పుడు తల్లితో పాటు తండ్రి, విద్యార్థి కూడా బయోమెట్రిక్ వేసి తీసుకెళ్లవచ్చు.

విద్యాకానుక కిట్‌లో...

బ్యాగు, అచ్చుపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, షూ, బెల్టు, రెండు రకాల డిక్షనరీలు అందించనున్నారు. ఇవి 1 నుంచి 10వ తరగతి విద్యార్థులందరికి అందించగా... బెల్టులకు సంబంధించి 1 నుంచి 10వతరగతి విద్యార్థులకు, 1 నుంచి 5వతరగతి బాలికలకు అందిస్తారు. అలాగే నోట్‌బుక్స్‌ను 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు, డిక్షనరీలు 1 నుంచి 6వ తరగతి వరకు చదివే విద్యార్థులకు అందిస్తారు. ఇందుకు సంబంధించి గత ఏడాది డిసెంబర్ నుంచే విద్యార్థుల వివరాలను సేకరించడంతో పాటు వారికి సరిపడే విధంగా బూట్లు, యూనిఫాం కొలతలను సేకరించారు.

మండల స్థాయిలో స్టాక్ పాయింట్లు

జగనన్న విద్యాకానుకను గతంలో మాదిరిగా కాకుండా ఈ ఏడాది విద్యార్థులకు మరింత వేగంగా చేరువ చేసేందుకు ప్రతి మండల కేంద్రంలో స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. విద్యా కానుకకు సంబంధించిన సామగ్రి జిల్లా స్టాక్ పాయింట్‌కు కాకుండా ఈ ఏడాది నేరుగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌కు రానున్నాయి. స్టాక్ పాయింట్‌కు వచ్చిన వస్తువులన్నింటిని ఒక కిట్టు రూపంలో సిద్ధం చేసి అన్ని వస్తువులను ఒకేసారి విద్యార్థులకు అందించనున్నారు. దీంతో పాటు వీటి పంపిణీ పర్యవేక్షణకు ఒక కమిటీని నియమించారు. ఇందులో స్టోరేజీ పాయింట్ చైర్మన్‌గా ఎంఈఓను, కన్వీనర్‌గా పాఠశాల హెచ్‌ఎం, సభ్యులుగా వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం, మండల ఇంజినీరింగ్ అధికారి, సీఆర్పీలను నియమించారు. వీరంతా విద్యాకానుక కిట్లు పాఠశాలలకు చేరవేసే సమయంలో కూడా అన్ని రికార్డులను మెయింటెన్ చేయాల్సి ఉంటుంది.

జిల్లా పరిశీలకుడిగా వెంకటకృష్ణారెడ్డి

జగనన్న విద్యాకానుక పంపిణీకి జిల్లా పరిశీలకులుగా రాష్ట్ర మోడల్ స్కూల్స్ జేడీ మార్తల వెంకటకృష్ణారెడ్డిని నియమించారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో పర్యటించి జేవీకే స్టోరేజీ పాయింట్లను తనిఖీ చేశారు.

పక్కాగా పంపిణీ

జగనన్న విద్యాకానుక కోసం మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్టోరేజీ పాయింట్లను పరిశీలిస్తున్నాం. నిల్వ ఉంచేందుకు తగిన వసతి ఉందా, వర్షం వస్తే తడుస్తాయా, విద్యా కానుక కిట్లకు భద్రత ఎలా ఉందనే అంశాలన్నింటిని పరిశీలిస్తున్నాం. దీంతో పాటు విద్యాకానుక కమిటీలతో చర్చిస్తున్నాం.
– పురుషోత్తం, జిల్లా విద్యాశాఖాధికారి, రాయచోటి



మార్గదర్శకాలు ఇచ్చాం

2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జేవీకే కిట్టును విద్యార్థులకు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. దీంతో పాటు ఈ ఏడాది నూతనంగా మండల స్థాయిలో స్టోరేజీ పాయింట్లను గుర్తించాం. జేవీకే సామగ్రి ఇప్పుడు నేరుగా మండల స్థాయి స్టోరేజీ పాయింట్లకు చేరుతుంది.
-కరుణాకర్, సీఎంఓ, సమగ్రశిక్ష, రాయచోటి

టీడీపీ ప్రభుత్వ హయాంలో..

విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందలేదు. కిట్లు ఇవ్వలేదు. యూనిఫాం కూడా నాణ్యత లేనివి ఇచ్చారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో...

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తున్నారు. యూనిఫాం తోపాటు అన్ని వస్తువులు నాణ్యత ఉండేలా చర్యలు తీసుకున్నారు. పాఠశాల తెరిచిన రోజే అన్ని అందజేస్తున్నారు. విద్యకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది.

జిల్లా సమాచారం

విద్యార్థులు	1,54,789
బాలికలు	75,435
బాలురు	79,354
బ్యాగులు	1,54,789
యూనిఫాం	1,54,789
నోట్‌బుక్స్	8,87,786
బెల్ట్స్	1,10,380
బూట్లు	1,53,818
డిక్షనరీలు	17,750

స్టాక్ పాయింట్లు...

మండల స్థాయిలో	30
జిల్లా స్థాయిలో	01

మదనపల్లెలో ట్రాఫిక్ పోలీస్ విభాగం ఏర్పాటుకు చర్యలు

ఎస్పీ గంగాధర్‌రావు



టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు

మదనపల్లె : మదనపల్లె పట్టణంలో త్వరలోనే ట్రాఫిక్ పోలీస్ విభాగం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఇది వరకు డివిజన్లలోని అన్ని పోలీస్ స్టేషన్ల నుంచి పోలీసు సిబ్బందిని కొత్తగా నియమిస్తామన్నారు. పూర్తిస్థాయిలో మదనపల్లె పట్టణ ట్రాఫిక్ పోలీస్ విభాగానికి సిబ్బందిని కేటాయిస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు షిఫ్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జాతీయ రహదారుల్లో జిల్లావ్యాప్తంగా 108 బ్లాక్‌స్పాట్లను గుర్తించామన్నారు. ఇంజినీరింగ్ విభాగంతో కలిసి బ్లాక్‌స్పాట్ల వద్ద వాహనాల వేగాన్ని తగ్గించేందుకు జిగ్‌జాగ్ విధానాన్ని అమలు పరుస్తున్నట్లు తెలిపారు. ప్రతినెలా రోడ్డు సేఫ్టీ సమావేశంలో ప్రమాదాల నివారణపై చర్చిస్తున్నట్లు తెలిపారు. వేసవికాలంలో పిల్లలు విహారాలకు, బంధువుల ఇళ్లకు వెళతారని ప్రమాదాల బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. సచివాలయ మహిళా పోలీసుల ద్వారా కరపత్రాలు ఇంటికి పంచి, చోరీలు ఇతర అసాంఘిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. చోరీల నివారణలో భాగంగా రాత్రివేళ గస్తీని ముమ్మరం చేస్తున్నట్లు వివరించారు. వేరే ఊర్లకు వెళ్లే వారు ఆ సమాచారాన్ని సమీపంలోని పోలీసుల స్టేషన్‌లో ఇవ్వాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆస్తుల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ కేశప్ప, సీఐలు మురళీకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంప్రదాయ కూరగాయలను పరిరక్షించుకుందాం

ఉద్యాన కళాశాలలో ముగిసిన జాతీయ సదస్సు



సంప్రదాయ సాగుపై శాస్త్రవేత్తలతో చర్చిస్తున్న యూనివర్సిటీ డీన్ ఏఎస్ పద్మావతమ్మ

రైల్వేకోడూరు: సంప్రదాయ, దేశీయ కూరగాయల సాగును ప్రోత్సహించాలని, దేశీయ జాతుల పరిరక్షణకు శాస్త్రీయ పరిశోధనలు అవసరమని వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ డీన్ డాక్టర్ ఏఎస్ పద్మావతమ్మ, రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు పేర్కొన్నారు. అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో ఎథ్నిక్ విజిటబుల్స్ అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో డీన్ మాట్లాడుతూ ఈ సదస్సులో సంప్రదాయ కూరగాయల సాగులో నూతన విధానాలు, తాజా పరిశోధనలు, భవిష్యత్ అవసరాలపై చర్చ జరిగినట్టు తెలిపారు. అనంతరం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో సదస్సులో పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సంప్రదాయ పంటలను సాగుచేయాలని, దేశీయ కూరగాయల సాగులో సాంకేతికత వినియోగించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ గోపాల్, సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శులు డాక్టర్ సదరున్నీసా, డాక్టర్ జయప్రద, డాక్టర్ లలిత పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత



హాకీ క్రీడాకారులతో డీఎస్‌డీఓ, కోచ్‌లు

మదనపల్లె సిటీ: క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు డీఎస్‌డీఓ షేక్ షఫీ అన్నారు. ఆదివారం స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో వేసవి హాకీ శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి పాఠశాలలో జనగన్న క్రీడా క్లబ్‌లను ఏర్పాటు చేశారన్నారు. వేసవిలో జిల్లాలో 50 చోట్ల క్రీడా శిబిరాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కడపలోని వైఎస్సార్ క్రీడా పాఠశాలలో వచ్చే నెల 4,5 తరగతులకు ఎంపిక పరీక్షలు జరుగుతాయన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనవచ్చునన్నారు. వేసవి శిబిరం ముగింపు రోజు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ పీడీ ప్రసాద్‌రెడ్డి, హాకీ కోచ్ నౌషాద్, పీడి నరేష్, అన్నమయ్య జిల్లా హాకీ ప్రెసిడెంట్ ప్రసాద్,వంశీ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చుదాం..!

SAKSHI SPECIAL

ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతోంది. దీంతో పాటు అనేక శుభకార్యాలు నిర్వహిస్తున్నారు. ఈ శుభకార్యాల్లో ప్రత్యేక వంటల పేరుతో వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేస్తూ విపరీతంగా వృథా చేస్తున్నారు. ఇదే సమయంలో పూటకు సరైన తిండి దొరకక అనేక మంది ఆకలితో పస్తులు ఉంటున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి నిరుపేదలకు పంపిణీ చేస్తున్నారు. ఈ అంశంపై సాక్షి ప్రత్యేక కథనం..

- కొనసాగుతున్న పెళ్లిళ్ల సీజన్
- శుభకార్యాల్లో భారీగా ఆహారం వృథా
- ఆకలితో ఉన్నవారికి కడుపు నింపాలంటున్న సంస్థలు



వృద్ధులకు ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న ఏపీఎస్‌యూఎఫ్ సభ్యులు



యాచకులకు ఆహార పొట్లాలను అందజేస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సంస్థ సభ్యుడు

మదనపల్లె సిటీ: ప్రస్తుతం శుభకార్యాల సీజన్ కొనసాగుతోంది. వీటిల్లో అనేక రకాల ఆహార పదార్థాలను తయారు చేస్తూ వండి వార్చుతున్నారు. కానీ ఇదే సమయంలో చాలా మొత్తంలో ఆహారం వృథా చేస్తున్నారు. హోదాను అనుసరించి పేద,మధ్య తరగతి కుటుంబాల వారైతే వారు చేసే పెళ్లి వేడుకల్లో భోజనానికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇక ఉన్నతంగా ఉన్న కుటుంబాల్లో వివాహాల్లో రూ.పది లక్షలకుపైగా ఖర్చు చేస్తున్నారు.

- జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రాజంపేట, పీలేరు, రైల్వేకోడూరుతో పాటు మండల కేంద్రాల్లో సైతం కళ్యాణ మండపాలు వెలిశాయి. మదనపల్లె పట్టణంలో సుమారు 60 వరకు కళ్యాణమండపాలు, ఫంక్షన్‌హాళ్లు ఉన్నాయి. ముఖ్యంగా పట్టణ కేంద్రాల్లోని ఫంక్షన్‌హాళ్లలో ఆహారం ఎక్కువ వృథా అవుతోంది. ఒక్కో ఫంక్షన్ హాల్‌లో దాదాపు వారు ఏర్పాటు చేసిన దాంట్లో 25–30 శాతం వరకు ఆహారం వృథా అవుతున్నట్లు అంచనా.

పలు స్వచ్ఛంద సంస్థలు మేము సైతం అంటూ..

మదనపల్లె పట్టణంలో పలు స్వచ్ఛంద సంస్థలు మేము సైతం అంటూ ఫంక్షన్ హాళ్లలో మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి యాచకులు, ఫుట్‌పాత్‌లపై ఉన్న వృద్ధులకు అందిస్తున్నారు. హెల్పింగ్‌మైండ్స్, ఏపీఎస్‌యుఎఫ్, ఆహార ధాత్రి, వివేకా ఆశయ ఫౌండేషన్ వంటివి మిగిలిపోయిన ఆహారాన్ని స్వచ్ఛందంగా సేకరించి పేదలకు అందజేస్తున్నారు.

ఫోన్ చేస్తే వచ్చి తీసుకెళ్తాం



ఏవైనా శుభకార్యాలు వంటి వాటిలో వండిన ఆహారం మిగిలిపోతే 9502461515కు ఫోన్ చేస్తే వెంటనే వచ్చి ఆ ఆహారం తీసుకెళ్తాం. వాటిని యాచకులు, వృద్ధులు వంటి వారికి అందజేస్తాం. – అబూబకర్‌సిద్దిక్, హెల్పింగ్‌మైండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు

ఆర్థికంగా పెనుభారం



శుభకార్యాలు వంటి వాటిల్లో అవసరానికి మించి ఆహార పదార్థాలను ఏర్పాటు చేసి వృథా చేస్తున్నారు. వివాహం, శుభ కార్యం జరిపించే వారికి కూడా ఆర్థికంగా పెనుభారం పడుతోంది. ఫంక్షన్‌లో మితిమీరిన ఖర్చు చేస్తున్నారు. ఫంక్షన్లు నిర్వహించేవారు గ్రహించి వృథాను అరికట్టాలి. – ప్రణయ్, ఏపీఎస్‌యూఎఫ్ వ్యవస్థాపకులు, మదనపల్లె

క్రీడల్లో రాణిస్తే.. రాజసమే..!

క్రీడల్లో రాణించాలని ఆసక్తి ఉన్న క్రీడాకారులను.. గ్రామీణ క్రీడాకారుల్లో దాగిఉన్న సామర్థ్యాలను వెలికితీసేందుకు చక్కటి వేదికగా నిలుస్తోన్న డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో ప్రవేశాల ప్రక్రియకు రంగం సిద్ధమైంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల పంట పండించిన పాఠశాలలో ప్రవేశం కోసం ఎంపిక ప్రక్రియ మూడుదశల్లో ఉంటుంది.

- క్రీడాపాఠశాలలో ప్రవేశాలకు వేళాయె
- 4,5వ తరగతిలో ప్రవేశానికి ఎంపికలు
- జూన్‌లో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో సెలక్షన్స్

కడప స్పోర్ట్స్ : రాష్ట్రంలోని ఏకైక క్రీడాపాఠశాల డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాల. 2006 డిసెంబర్ 30వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పాఠశాల రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలోని ఏకై క క్రీడాపాఠశాల కావడంతో రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలగా రూపుదిద్దుకుంది. ఎందరో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను దేశానికి అందించిన ఈ పాఠశాలలో ప్రవేశం పొందాలంటే మూడుదశల్లో ఎంపికల ప్రక్రియను పూర్తిచేసుకుని రావాల్సి ఉంటుంది. ఇందులో ప్రవేశం పొందడం ద్వారా క్రీడాకారులు తమ ఉన్నతికి బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది.

4వ తరగతిలో ప్రవేశాలు: డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశానికి 20 సీట్లు బాలికలకు, 20 సీట్లు బాలురకు చొప్పున 40 సీట్లకు ఎంపికలు నిర్వహిస్తారు. తొలుత మండలస్థాయిలో ఎంపికలు నిర్వహించి అక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయికి పంపుతారు. జిల్లాస్థాయి ఎంపికలు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో చక్కటి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి ఎంపికలకు పంపుతారు. అక్కడ తుది ఎంపికలు నిర్వహించి 40 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేస్తారు. కాగా గతేడాది 4వ తరగతిలో మిగిలిన 11 సీట్లకు (7 బాలురు, 4 బాలికలు) ఈ యేడాది 5వ తరగతిలో ప్రవేశం కల్పిస్తారు.

ఏయే క్రీడాంశాల్లో శిక్షణ..

కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు 10 క్రీడాంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బాక్సింగ్, హాకీ, ఫుట్‌బాల్, వాలీబాల్, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్, తైక్వాండో, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడల్లో నిపుణులైన శిక్షకుల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారు.



డా.వైఎస్ఆర్ క్రీడాపాఠశాల

షెడ్యూలు

ఎంపికలు	తేదీలు	వేదిక
మండలస్థాయి	జూన్ 15 నుంచి 20	జిల్లాలోని మండల కేంద్రాల్లో
జిల్లాస్థాయి	జూన్ 22 నుంచి 26	జిల్లా కేంద్రమైన కడపలో
రాష్ట్రస్థాయి	జూన్ 29, 30	ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు

ఎవరు అర్హులంటే..

కాగా ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు 2014 ఆగస్టు1 నుంచి 2015 జూలై 31వ తేదీ మధ్య పుట్టిన విద్యార్థులు అర్హులు. 5వ తరగతిలో ప్రవేశం పొందగోరే విద్యార్థులు 2013 ఆగస్టు 1 నుంచి 2014 జూలై 31 మధ్యలో పుట్టిన వారు అర్హులు. మున్సిపాలిటీ/మీసేవ ద్వారా పొందిన పుట్టిన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాల్సి ఉంటుంది. అదే విధంగా ఆధార్‌కార్డు, క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్, ప్రధానోపాధ్యాయుడితో ధ్రువీకరించిన స్టడీ అండ్ కాండక్ట్ సర్టిఫికెట్, 6 పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకురావాల్సి ఉంటుంది.

ఎంపిక విధానం..

మూడు దశల్లో నిర్వహించే ఈ ఎంపికల్లో తొలుత మండల స్థాయిలో ఎంపికలు నిర్వహిస్తారు. మండల స్థాయిలో జూన్ 15 నుంచి 20వ తేదీ వరకు ఆయా మండలాల్లో ఎంపికలు జరుగుతాయి. విద్యార్థి ఎత్తు, బరువులతో పాటు మోటార్ స్కిల్స్ (30 మీటర్ల ఫ్లయింగ్‌స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, 800 మీటర్ల పరుగుపందెం)లో ఎంపికలు నిర్వహిస్తారు. ఈ ఎంపికలను మండల కేంద్రాల్లో ఎంఈఓ, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. అనంతరం జిల్లాస్థాయిలో ఎంపికలు స్టెప్ సీఈఓ/డీఎస్ఏ చీఫ్ కోచ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపడతారు. జిల్లాస్థాయి ఎంపికలు జూన్ 22 నుంచి 26 వరకు కడప డీఎస్ఏ క్రీడామైదానంలో నిర్వహిస్తారు.

క్లుప్తంగా

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు... రామసముద్రం మండలం కాటేవారిపల్లెకు చెందిన లక్ష్మిదేవి (40) కడుపునొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఆదివారం ఇంటిలోనే పురుగులమందుతాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా బి.కొత్తకోట బీసీకాలనీకి చెందిన లోకేష్ (30) లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా శనివారం రాత్రి ఇంటిలోనే ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పటించుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి మంటలు అదుపు చేశారు. బాధితున్ని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బి.కొత్తకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జామతోట దగ్ధం

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండలపరిధిలోని గొరిగెనూరు గ్రామానికి చెందిన తలారి కాంతమ్మ అనే రైతుకు చెందిన జామ చెట్లు కాలి బూడిదయ్యాయి. కాంతమ్మ తనకు ఉన్న ఒకటిన్నర ఏకరా పొలంలో జామచెట్లు వేసింది. ఆదివారం మంటలు వస్తుండటంతో స్థానిక రైతులు చూసి వెంటనే కాంతమ్మకు తెలియజేశారు. అమె అక్కడికి వెళ్లి చూసేసరికి తోట బూడిదగా మారింది. 600 జామచెట్లు, డ్రిప్పు పరికరాలు కాలిపోయాయి దాదాపు రూ. 2.50 లక్షలు నష్టం వాటిల్లిదని ఆమె తెలిపారు.ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది.ఆకతాయిలు నిప్పు పెట్టారా లేక ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పురవ్వలు పడి ఈ సంఘటన జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ సుబ్బారావు పొలం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఎవరి మీద అయిన అనుమానం ఉంటే ఫిర్యాదు చేయలేని రైతుకు సూచించారు. కేసు నమోదు చేసి విచారిస్తామని ఆయన సూచించారు.

ఎస్‌ఈబీ సిబ్బందిపై దాడికి యత్నం

చాపాడు : వైఎస్సార్‌జిల్లా అనంతపురం గ్రామం వద్ద ఆదివారం ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేసేందుకు వెళ్లిన ప్రొద్దుటూరు ఎస్‌ఈబీ సీఐ మోహన్‌రెడ్డి, కానిస్టేబుల్ గురయ్యపై అనంతపురం గ్రామానికి చెందిన గండు రాజు, గండు వెంకటరమణ కట్టెలతో దాడికి ప్రయత్నించినట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున మోహన్‌రెడ్డి, గురయ్యలు బొలెరో వాహనంలో వెదురూరు, రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల్లో తనిఖీలు చేస్తుండగా అనంతపురం వద్ద ఇసుక ట్రాక్టర్‌ను గుర్తించారు. ఈ క్రమంలో ట్రాక్టర్‌ను ఆపి పట్టుకునేందుకు ప్రయత్నించిన సీఐ, కానిస్టేబుల్‌పై రాజు, వెంకటరమణ దాడికి ప్రయత్నించారు. ఈ ఘటనపై సీఐ మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

చెన్నూరు : వైఎస్సార్‌జిల్లా చెన్నూరులో ఐపీఎల్‌కు సంబంధించి క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారన్నా సమాచారంతో ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.60వేల నగదు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.

విత్తనాల ఎంపిక కీలకం

ఆర్‌బీకే, వ్యవసాయాధికారుల సూచన



విక్రయానికి సిద్ధంగా ఉన్న వేరుశనగ విత్తనపు కాయల ప్యాకెట్లు

రాయచోటి : ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. కొనుగోలు సమయంలో అప్రమత్తంగా లేకపోతే కొందరు వ్యాపారులు నాణ్యతలేని విత్తనాలు అంటగట్టే అవకాశం ఉంది. విత్తనాలు స్థితిగతులను గమనించకపోవడం వల్లే రైతులు నష్టాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా వరి, వేరుశనగ, కంది, అలసంద, జొన్న, ఆముదం, కూరగాయల విత్తనాల విషయంలో రైతులు అవగాహన కలిగి ఉండాలని ఆర్‌బీకే, వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ప్రతి పంచాయతీలో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేలు ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తుంది.

తక్కువ ధర చూసి మోసపోవద్దు..

జూన్ మొదటి వారంలో వర్షాలు పడగానే సాగు పనుల హడావిడి మొదలవుతుంది. ఈ సమయంలో ఫర్టిలైజర్ షాపుల వారితోపాటు అనుమతి లేకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి నుంచి రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలలో ఇదే అదునుగా కొందరు వ్యాపారులు తక్కువ ధరకు నాణ్యతలేని విత్తనాలను అంటగడుతుంటారు. ధర తక్కువని కొనుగోలు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉంటుంది.అందువల్ల ప్రైవేటు వ్యక్తుల వద్ద నుంచి కొనుగోలు చేయరాదు. దుకాణాలు, గ్రామాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రభుత్వం సర్టిఫై చేసిన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలి. దుకాణాదారుడి నుంచి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. విత్తనాలు ఏ సంస్థకు చెందినవో ప్యాకెట్‌పై ఉన్న లేబుల్, ల్యాబ్ నెంబర్‌ను రశీదుపై నమోదు చేసుకోవాలి. ముందస్తుగా విత్తనాలు మొలకెత్తే శాతాన్ని ఇంటివద్ద పరిశీలించి తరువాతే పొలంలో విత్తుకోవాలి. విత్తిన తరువాత కూడా విత్తన ప్యాకెట్లను, రశీదులను భద్రపరుచుకోవాలి.

నకిలినీ అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు

నకిలీ విత్తనాల విక్రయాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీయాక్ట్ నమోదు చేయాలని ప్రభుత్వం, కలెక్టర్లు, వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, పోలీస్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేయడంతోపాటు రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

రశీదు తప్పక తీసుకోవాలి



విత్తనాల ఎంపికపై రైతులు అవగాహన పెంచుకోవాలి. కొనుగోలు చేసిన ప్యాకెట్లలో ఉన్న విత్తనాలు ఎంతశాతం మొలకెత్తాయో ముందుగానే చూసుకోవాలి. రశీదు తప్పక తీసుకొని దానిని భద్రపరుచుకోవాలి. ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే సమాచారం అందించాలి.

-దివాకర్,
మండల వ్యవసాయ అధికారి, రాయచోటి

'ఇంటాక్' సేవలను విస్తరిద్దాం

కడప కల్చరల్ : ఇంటాక్ సంస్థ సేవలను విస్తరించేందుకు ప్రజలు కలిసి రావాలని వైఎస్సార్‌జిల్లా కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ పేర్కొన్నారు. భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా చాప్టర్ నూతన కన్వీనర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వారసత్వ రక్షణ బాధ్యతను విద్యార్థుల పాఠ్యపుస్తకాలలోని ప్రతిజ్ఞ ద్వారా ఆనాడే మన విద్యావేత్తలు గుర్తు చేశారన్నారు. ప్రజలకు వారసత్వ సంపదపై అవగాహన కల్పిస్తే వాటిని కాపాడుకోవచ్చన్నారు.అనంతరం ఆయన ఆధ్వర్యంలో ఇంటాక్ పూర్వ కన్వీనర్ ఇలియాస్‌రెడ్డి, నూతన కన్వీనర్‌గా మానస కె. చిన్నపరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే కో కన్వీనర్, 70 మంది నూతన సభ్యులు కూడా ప్రమాణం చేశారు. నూతన కన్వీనర్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ జిల్లా వారసత్వ సంపదను రక్షించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. వైఎస్సార్ జిల్లాలోని ప్రొద్దుటూరు, బద్వేలు, అన్నమయ్య జిల్లాలోని రాజంపేట. రాయచోటిలలో కూడా ఇంటాక్‌ను విస్తరింపజేస్తామన్నారు. పాత కలెక్టరేట్ పూర్తిగా శిథిలం కాకముందే మరమ్మతులు చేయించాలని, మ్యూజియాన్ని అందులోకి మార్చాలని కోరారు. సంస్థ పూర్వ కన్వీనర్ ఇలియాస్‌రెడ్డి ఇంటాక్‌లో తన 15 ఏళ్ల ప్రస్థానాన్ని వివరించారు.

పదోన్నతులను మాన్యువల్‌గా నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న పదోన్నతులను ఆన్‌లైన్‌లో కాకుండా మాన్యువల్‌గా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ మహమ్మద్ ఇర్షాద్ మాట్లాడుతూ బదిలీల షెడ్యూల్ ప్రకటించడానికి ముందే మే 17న విద్యాశాఖ మంత్రి సమక్షంలో అధికారులకు ఉపాధ్యాయ సంఘాలు జరిగిన చర్చలో ప్రమోషన్లను మాన్యువల్‌గా నిర్వహిస్తామని హామీ ఇచ్చార న్నారు. అందుకు భిన్నంగా ఆన్‌లైన్ ద్వారా జరపాలని నిర్ణయించడం సరికాదని అన్నారు.

టిప్పర్ ఢీ: ఇద్దరి దుర్మరణం



యాకోబు మృతదేహం



ముబారక్ మృతదేహం

కడప అర్బన్ : కడపలోని రిమ్స్ ఆసుపత్రి సమీపంలో బొరుగుల ఫ్యాక్టరీకి వెళ్లే దారిలో స్నేహితుడి రాకకోసం ఎదురు చూస్తున్న ఇద్దరిని మట్టి తీసుకెళుతున్న టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన ఇద్దరూ డ్రైవర్లుగా విధులను నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో చెన్నూరు మండలం చిన్నమాచుపల్లెకు చెందిన యాకోబు(35), కడప నగరం కాగితాల పెంటకు చెందిన ముబారక్ (24)లు ఉన్నారు. యాకోబు చెల్లెలు కడప రిమ్స్‌లో వైద్య సేవలను పొందుతుండగా చూసేందుకు ఇద్దరు ద్విచక్ర వాహనంలో కడప నుంచి బయలుదేరారు. బొరుగుల ఫ్యాక్టరీకి వెళ్లేదారిలో తమ స్నేహితుడు వీరయ్య కోసం ఎదురు చూస్తూ రోడ్డు పక్కన తమ ద్విచక్రవాహనాన్ని నిలబెట్టుకుని ఉన్నారు. అదే సమయంలో మట్టిలోడుతో ఉన్న టిప్పర్ రిమ్స్ వైపు నుంచి వేగంగా వచ్చి ఢీకొనడంతో వీరిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ముబారక్‌కు ఇంకా వివాహం కాలేదు. యాకోబుకు భార్య అపర్ణ, కుమార్తె ఉన్నారు. సంఘటన స్థలంలో యాకోబు భార్య, ముబారక్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సంఘటన స్థలాన్ని కడప రిమ్స్ పీఎస్ ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాలను కడప రిమ్స్ మార్చురీకి తరలించారు.

బైకులు అదుపుతప్పి ఇద్దరికి తీవ్రగాయాలు

నిమ్మనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనలు ఆదివారం నిమ్మనపల్లె మండలంలో జరిగాయి. కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజిగారిపల్లెకు చెందిన మల్లీశ్వరయ్య అలియాస్ వేణు (46) మదనపల్లెలోని అభ్యుదయ స్కూల్ బస్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం వ్యక్తిగత పనుల నిమిత్తం మదనపల్లెకు వెళ్లి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా రాచవేటివారిపల్లె పంచాయతీ ఆచార్లపల్లె వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడంతో అధిక రక్తస్రావమైంది. స్థానికులు 108కు సమాచారం అందించారు. బాధితున్ని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. బాధితునికి భార్య బుజ్జమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు. అదే విధంగా బండ్లపై గ్రామానికి చెందిన రెడ్డిశేఖర్ (15) ఆదివారం ద్విచక్రవాహనంలో పొలం వద్దకు వెళుతుండగా వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో బాధితుడి కాలు విరిగింది. కుటుంబ సభ్యులు అతన్ని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ముగ్గురు అరెస్ట్



అరెస్టయిన నిందితులతో పోలీసులు

గుర్రంకొండ : టి.పసలవాండ్లపల్లె పంచాయతీ ఎగువ దళితవాడకు చెందిన రౌడీ షీటర్ బాలపోగు ఉత్తయ్య(50) హత్యకేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు మదనపల్లె ఎస్టీ ఎస్సీసెల్ డీఎస్పీ సుధాకర్, గుర్రంకొండ ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌లు ఆదివారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు ఉత్తయ్య పాత నేరస్తుడు. ఆరునెలల క్రితం బెంగళూరు నుంచి గ్రామానికి వచ్చాడు. ఇక్కడ మద్యానికి బానిసై అందరిపై దౌర్జన్యం చేయడం, బెదరించడం వంటి చర్యలకు పాల్పడేవాడు. ఇదే పంచాయతీ ఉదారవాండ్లపల్లెకు చెందిన వి. చలపతికి ఎగువ దళితవాడకు పక్కనే పొలాలు ఉన్నాయి. ఎగువ దళితవాడ మీదుగానే చలపతి పొలానికి వెళ్లాల్సి ఉంది. రెండునెలల క్రితం చలపతి పొలానికి వెళ్లే దారిని ఉత్తయ్య ఎగువ దళితవాడకు చెందిన మరో ఇద్దరితో కలసి మూసివేయించాడు. దీంతో చలపతి కుటుంబానికి, ఉత్తయ్య మధ్య వాగ్వివాదంతోపాటు చిన్నపాటి ఘర్షణ జరిగింది. అప్పట్లో గ్రామపెద్దలు జోక్యం చేసుకొని వివాదాన్ని తాత్కాలికంగా పరిష్కరించారు. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య కక్షలు అలాగే ఉన్నాయి. ఈనేపథ్యంలో ఈనెల 21న సాయంత్రం పొలం వద్ద ఒంటరిగా ఉన్న చలపతి మనవరాలు మహేశ్వరీ(13)పై కత్తితో ఉత్తయ్య దాడి చేశాడు.మహేశ్వరీకి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆగ్రహించిన చలపతి కుటుంబసభ్యులు ఉత్తయ్యపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈదాడిలో ఉత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు 302, ఎస్సీ,ఎస్టీ యాక్టు కింద కేసు నమోదు చేశారు. ఈకేసులో ఇదే పంచాయతీ ఉదారివాండ్లపల్లెకు చెందిన నిందితులు ఉదారి చలపతి(60), ఉదారి లక్ష్మీపతి(23), ఉదారి సురేంద్ర(28)లను గత శనివారం రాత్రి గ్రామానికి సమీపంలోని కడప–బెంగళూరు జాతీయ రహదారిపై ఆంజినేయస్వామి ఆలయం వద్ద ఉండగా మదన పల్లె ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ సుధాకర్, గుర్రంకొండ ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌లు తమ సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకొన్నారు. వీరిని రిమాండ్ నిమిత్తం మదనపల్లె సబ్ జైల్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు.

ముగిసిన సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీలు



విజేతలతో రాజంపేట ఎమ్మెల్యే మేడా

సుండుపల్లె(రాజంపేట) : అన్నమయ్య జిల్లా సుండుపల్లె క్రీడామైదానంలో మూడురోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి 10వ జూనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీలు ముగిశాయి.ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ బాలుర విభాగంలో విజయనగరం, అనంతపురం జిల్లాల జట్లు తలపడ్డాయి. విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. బాలిక విభాగంలో కడప, అనంతపురం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. కడప జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో రాష్ట్ర పీఈటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాజు, ఎంపీపీ రాజమ్మ, జడ్పీటీసీ ఇస్మాయిల్, వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి శివారెడ్డి, రహిమాన్, ప్రధానోపాధ్యాయుడు సునీల్‌కుమార్, సీఐ లింగప్ప, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు జ్ఞాపికలు అందచేసిన ఎమ్మెల్యే

రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీల్లో విజేతగా నిలిచిన జట్లకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి జ్ఞాపికలను అందచేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషిచేస్తున్నారన్నారు. విద్యతోపాటు క్రీడలను కూడా పెంపొందించాలనే ఉద్దేశంతో పలు కార్యక్రమాలను తీసుకొచ్చారన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

నీటిలో మునిగి యువకుడి మృతి



భార్గవ్ మృతదేహం

కలకడ : ప్రమాదవశాత్తు నీటిలో మునిగి యువకుడు మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి కలకడ మండలం గంగాపురం ఇసుక రీచ్‌వద్ద జరిగింది. ఎస్‌ఐ సీటీ స్వామి కథనంమేరకు వివరాలిలాఉన్నాయి. కలికిరి మండలం, మహల్ పంచాయతీ కొత్తపల్లెకు చెందిన శ్రీనివాసులు కుమారుడు కందూరి. భార్గవ్(20) ఆదివారం సాయంత్రం తండ్రితోపాటు కలిసి కట్టెల (వంటచెరకు) కోసం రీచ్ వైపు వెళ్లాడు. శ్రీనివాసులు కట్టెలమోపుతో ఇంటికి చేరుకున్నాడు. రాత్రి 10గంటలైనా కుమారుడు మరో మోపు కట్టెతో ఇంటికి చేరుకోక పోవడంతో చుట్టు పక్కల వెతికాడు. ఫలితం లేకపోయింది. రాత్రి సమయంలో గ్రామస్తులు టార్చ్‌లైట్లు వేసి చూడగా గంగాపురం ఇసుకరీచ్‌లోని నీటిలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కలకడ సీఐ నాగేంద్ర, ఎస్‌ఐ సిటిస్వామిలు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

16 మంది ఎర్రస్మగ్లర్ల అరెస్టు



నిందితుల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు, అన్నమయ్య జిల్లా తుమ్మలబైలు రెండు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 16 మంది స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 23 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. డీఐజీ సెంథిల్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబుల పర్యవేక్షణలో రెండు టీమ్‌లు శనివారం రాత్రి నుంచి కూంబింగ్ నిర్వహించారు. ఆర్‌ఐ చిరంజీవి, ఆర్‌ఎస్‌ఐ నరేష్ బృందం కడప సబ్ కంట్రోల్ నుంచి సీఎల్ బావి బేస్‌క్యాంపు చేరుకుని అగ్నిగుండాల మీదుగా తిప్పిరెడ్డిపల్లి, అక్కడి నుంచి జోరగోడ్ల ప్రాంతానికి ఉదయం 6గంటలకు చేరుకున్నారు. ఆ సమయంలో ఎర్రచందనం దుంగలను కొందరు మోసుకుని వస్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టి 14 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 17 ఎర్రచందనం దుంగలను, లగేజీ ఆటోను, రెండు మోటార్‌సైకిళ్లు, 13 పిడిలేని ఇనుప గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో అనంతపురం జిల్లా కదిరికి చెందిన మేకల నాగమల్లప్ప నాయుడు, వైఎస్ఆర్ జిల్లా ఖాజీపేటకు చెందిన ఇడగొట్టు నగేష్, మైదుకూరుకు చెందిన ఇడగొట్టు నాగేశ్వరరావు, ఇడగొట్టు శ్రీనివాసులు, బ్రహ్మంగారి మఠానికి చెందిన దేవళ్ల సుబ్బరాయుడు, చాపాడుకు చెందిన తమ్మిశెట్టి వెంకట సుబ్బయ్య, శ్రీపతి ప్రీదిపాల్, రామరాజశేఖర్, శ్రీరామ జాస్వా, ప్రొద్దుటూరు టౌన్‌కు చెందిన మామిళ్ల నాగేంద్ర, ఇల్లూరు వినోద్, కడప నగరానికి చెందిన మల్లెల బోయిన వెంకటేశు, అనంతపురం జిల్లా ఎస్.పి కుంటకు దండి సూరి, సత్యసాయి జిల్లా గాలంపేటకు చెందిన మొలకల శేషాద్రి ఉన్నారు. ఆర్‌ఐ సురేష్‌కుమార్ రెడ్డికి చెందిన టీమ్ లింగాధర్ సానిపాయి బేస్ క్యాంపు నుంచి పొంతరేవల మీదుగా కూంబింగ్ నిర్వహించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట రేంజిలోని తుమ్మలబైలు చేరుకుని చిప్పగొందిదొన వద్దకు రాగా, అక్కడ కొందరు ఎర్రచందనం దుంగలు మోసుకుని వస్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా కొందరు పారిపోయారు. వీరిలో ఇద్దరిని పట్టుకోగలిగారు. వీరి వద్ద నుంచి 6 ఎర్రచందనం దుంగలను స్వా ధీనం చేసుకున్నారు. వీరిని తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునామత్తూరుకు చెందిన శివరాజ్, శివమణిగా గుర్తించారు. మొత్తం రెండు సంఘటనల్లో 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసు కోగా, వీటి విలువ సుమారు రూ. 40 లక్షలు ఉంటుందనీ డీఎస్పీలు తెలిపారు. ఈ కేసులను సీఐ బాలకృష్ణ, ఎస్‌ఐ మోహన్‌నాయక్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక వర్గాన్ని విస్మరిస్తున్న బీజేపీ ప్రభుత్వం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని విస్మరిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు పేర్కొన్నారు. ఆదివారం ఏఐటీయూసీ రాష్ట్ర సమ్మేళనాల్లో భాగంగా రెండోరోజు ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో కార్మిక లోకానికి అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీలకు తెలంగాణ తరహాలో రూ. 13 వేలు వేతనం ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రధాని మోదీ ప్రైవేట్ పరం చేసి అదానీ, అంబాలనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్మిక వర్గాన్ని పోరాటాలకు సిద్ధం చేసేందుకు యువ కార్మిక సమ్మేళనాలు, విద్యా, వైద్యానిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లసాని రామారావు, నాగసుబ్బారెడ్డి, వేణుగోపాల్, కెసీ బాదుల్లా, మద్దిలేటి పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు




సర్టిఫికెట్లతో చిన్నారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శాస్త్రినగర్‌లో ఆదివారం జిల్లా స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్–8, 10, 12, 14 విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనపరచిన వారు జూన్ 3, 4 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలలో పాల్గొంటారని స్పీడ్ స్కేటింగ్ జిల్లా సెక్రటరీ పవన్ కళ్యాణ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బసిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డిలు గెలుపొందిన వారికి పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. పోటీలను ఆర్గనైజింగ్ సెక్రటరీ చరణ్‌కుమార్‌రెడ్డి, బాషా, నాగేంద్ర, చంద్ర, అహమద్‌బాషా, నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

వైఎస్సార్ జిల్లాలో బండలాగుడు పోటీలు

రాజుపాళెం : వైఎస్సార్ జిల్లా రాజుపాళెం మండలంలోని అర్కటవేముల గ్రామంలో గంగ జాతర సందర్భంగా ఆదివా రాష్ట్రస్థాయి సీనియర్స్ వృషభరాజముల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రొద్దుటూరు మండలంలోని చౌటపల్లె ఎద్దు 3409 అడుగులు లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. ఎద్ల యజమానికి రూ.1,00,016 నగదును అందించారు. ఇందులో మొత్తం ఆరు జతల ఎద్దు పాల్గొన్నాయి. 3250 అడుగులు లాగి రెండో స్థానంలో తెలంగాణ రాష్ట్రంలోని హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి ఎద్దు , మూడోస్థానంలో అనంతపురం జిల్లా గార్లదిన్నె రామాంజనేయులు ఎద్దు, నాలుగో స్థానంలో అనంతపురం జిల్లా ఉరవకొండ మహమ్మద్ ఆలీ ఎద్దు (2372 అడుగులు), 2355 అడుగులు లాగి ఐదోస్థానంలో నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోని మూడురాళ్లపల్లె పులి చిన్న ఓబుల్‌రెడ్డి ఎద్దు నిలిచాయి. గెలుపొందిన ఎద్ల యజమానులకు బహుమతులు అందజేశారు.

అంతర్‌జిల్లా దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లాతో పాటు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో ఏటీఎం కార్డును మార్చి బాధితుల వద్ద నుంచి నగదును అపహరిస్తున్న అంతర్‌జిల్లా దొంగ కొర్రా శ్రీకాంత్‌ను కడప వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ వెల్లడించారు. ఆదివారం రాత్రి కడప డీఎస్పీ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.శ్రీకాంత్ అనంతపురం జిల్లా తనకల్లు మండలం ఏనుగుండ్ల తండా గ్రామానికి చెందిన వ్యక్తి అన్నారు. నిందితుడి వద్ద నుంచి 27.5 గ్రాముల బంగారు ఆభరణాలను, రూ. లక్ష నగదును, మోటార్‌సైకిల్‌ను, 24 ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రెండున్నర లక్షల మేరకు ఉంటుందన్నారు. నిందితుడిపై ఇప్పటికే గుత్తి, మదనపల్లి, అలిపిరి, అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లలో కేసులున్నాయన్నారు.ఏటీఎం సెంటర్ల వద్ద అమాయకులైన ప్రజలను, ప్రధానంగా వృద్ధులను టార్గెట్ చేస్తాడన్నారు. బాధితుల వద్ద నుంచి ఏటీఎం కార్డులను ఏమార్చి వారికి తన వద్ద ఉన్న ఏటీఎం కార్డును ఇస్తాడన్నారు. బాధితుల కార్డులను ఉపయోగించి వారి ఖాతాల్లోని నగదును ఎంచక్కా కాజేస్తాడన్నారు. ఇటీవలి కాలంలో కడప వన్‌టౌన్‌లో రెండు కేసులు, ప్రొద్దుటూరు టూటౌన్, నెల్లూరు వన్‌టౌన్, శ్రీకాళహస్తి వన్‌టౌన్, చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లలో ఒక్కొక్క కేసు ఉందని తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్‌ఐలు మల్లయ్య, శ్రీను, క్రైమ్ పార్టీ హెడ్‌కానిస్టేబుల్ పాకా వరప్రసాద్, కానిస్టేబుళ్ల కిరణ్, నారాయణ రెడ్డి,బాష, ఖాదర్‌లకు డీఎస్పీ నగదు రివార్డులను అందజేసి అభినందించారు.